
ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులు

- మేడారం ఆలయం అభివృద్ధిలో ఖర్చుకు వెనకాడం
- మహాజాతర నాటికి పనులు పూర్తి, రాతికట్టడాలతోనే నిర్మాణాలు
- మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా కల్పించాలి
- నిధులు కేటాయించాలి కేంద్రానికి వినతి : సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఆలయ అభివృద్ధి, విస్తరణ ప్రణాళికలపై సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

మేడారం ఆలయ అభివృద్ధిలో ఖర్చుకు వెనకాడబోమని, ఆలయాన్ని రాతి కట్టడాలతో నిర్మించనున్నామని, మహా జాతర నాటికి పనులు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులని, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. మంగళవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలోని హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12.27 గంటలకు సిఎంతో పాటు సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి చేరుకోగా.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, దనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మహబూబాబాద్, వరంగల్ ఎంపిలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి శబరీష్.. పుష్ప గుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూం ప్రాంగణంలో సిఎం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడ నుంచి గిరిజన కొమ్ము కోయ నృత్యంతో, గిరిజన సంప్రదాయం ప్రకారం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు సిఎం చేరుకున్నారు. వనదేవతలను దర్శించుకుని, 68 కేజీల నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణ విస్తరణ, పునఃనిర్మాణం చేయనున్న పనులను సిఎం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు, సీనియర్ అధికారులు, పూజారులతో ఆలయ అభివృద్ధి, విస్తరణ ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు.

అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్, విస్తరణ డిజైన్లను పూజారులు, ఆదివాసీ సంఘాలకు వివరించారు. ఈ ప్రణాళికలకు అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించి పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి ఆదివాసీ సంఘాలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ... "ఆలయ ఆవరణలోని చెట్లను సంరక్షించుకుంటూనే విస్తరణ ప్రక్రియను కొనసాగించాలని తెలిపారు. అభివృద్ధి పనులను వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహా జాతర నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాతి కట్టడాలతో నిర్మాణాలు చేపట్టాలని, ప్రకృతికి దగ్గరగా ఆలయం ఉండేలా చూడాలని సూచించారు. జంపన్న వాగులో నీటి నిల్వలు ఉండేలా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నిధులు "గ్రీన్ ఛానల్"లో విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పనులను పూర్తి చేయించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వాములైన వారి జన్మ ధన్యమవుతుందని, భక్తితో, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అనంతరం మేడారంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర అని, ఇది తెలంగాణ ప్రజల ఆత్మీయత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీక అని సిఎం తెలిపారు. సమ్మక్క, సారలమ్మల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, గతంలో తాను ఈ గడ్డ నుంచే పాదయాత్ర ప్రారంభించానని గుర్తు చేసుకున్నారు. మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా కల్పించి నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కుంభమేళాకు వేల కోట్లు కేటాయిస్తున్నప్పుడు మేడారం జాతరకు ఎందుకు కేటాయించరని, దీనిపై కిషన్‌రెడ్డి ప్రధానిని ఒప్పించి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మేడారం మహా జాతరకు మళ్లీ వస్తానని.. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందామని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మేడారం జాతరను పునరుద్ధరించడం కోసం స్వయంగా ముఖ్యమంత్రి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం మధ్యాహ్నం 2.45 గంటలకు ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, బానుగాపాక్, కడియం శ్రీహరి, డాక్టర్ మురళి నాయక్, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య, తెలంగాణ ఆదివాసీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, పూజారుల సంఘం అధ్యక్షులు సిద్దబోయిన జగ్గారావు, జు. వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

నాణ్యమైన టెక్నికల్ విద్య : మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిరావు పూలే వ్యవసాయ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు మరింత నాణ్యమైన టెక్నికల్ విద్యను అందించడానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంతో ఒప్పందానికి ఎంజేపి కసరత్తు చేస్తున్నదని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల సొసైటీ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో బిసి సంక్షేమ శాఖ ఇన్ చార్జి సెక్రటరీ బుద్ధా ప్రకాశ్ , వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్, రాజేంద్ర నగర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జానయ్య, ఎంజెపి గురుకుల సెక్రటరీ సైదులు పాల్గొన్నారు. కరీంనగర్ ,వనపర్తి లలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే వ్యవసాయ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ద్వితీయ, తృతీయ, చివరి సంవత్సరం విద్యార్థులకు వ్యవసాయ విశ్వ విద్యాలయ అధ్యాపకుల సమక్షంలో విద్యా బోధన చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో కొనసాగనున్న కరీంనగర్, వనపర్తి వ్యవసాయ డిగ్రీ కాలేజీ విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు, ఫీల్డ్ విజిట్ ,మోడల్ సదుపాయాలు, ల్యాబ్, రాజేంద్ర నగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, దాని అనుబంధ కళాశాలల్లో నిర్వహణ జరిగేలా కసరత్తు చేయనున్నట్లు తెలిపారు.



యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం అన్నదాతల అరిగోస

- తొక్కిసలాటలో మహిళకు గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- పోలీసులు పహారాలో యూరియా పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూరియా కోసం అన్నదాతలు అరిగోసపడుతున్నారు. సొసైటీలు, రైతు సేవాకేంద్రాల వద్ద తెల్లవారుజాము నుంచే లైన్‌లో నిలబడి పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలో రైతుసేవ సహకార సంఘం కార్యాలయానికి యూరియా వచ్చిందన్న సమాచారంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు పెద్దఎత్తున తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచి యూరియా కోసం క్యూ కట్టారు. సహకార సంఘానికి 860 బస్తాల యూరియా రావడంతో రైతులకు రెండు బస్తాల చొప్పున టోకెన్లు విడుదల చేశారు. వీటితోపాటు మరో 450 బస్తాలు వచ్చే అవకాశం ఉండటంతో వాటికి కూడా టోకెన్లు ఇచ్చారు. మహిళా రైతులకు, రైతులకు వేర్వేరుగా లైన్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అందరికీ యూరియా అందుతుందో లేదోనన్న ఆందోళనలతో ఒకరినొకరు నెట్టుకోవడంతో తోపులాట జరిగింది. ఈ ఘటనలో గేమ్యా తండాకు చెందిన రమావత్ లక్ష్మి సొమ్మసిల్లి పడిపోయింది. పోలీసులు వెంటనే ఆమెను నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక సహకార సంఘం భవనం ముందు క్యూలో నిలబడిన చల్లకుర్తి గ్రామానికి చెందిన ఈసూరాజు శ్రీనివాస్‌ను ఓ పోలీస్ కానిస్టేబుల్ గట్టిగా లాగాడు. ఉదయం నుంచి లైన్‌లో నిలబడిన తాను.. బయటికి వెళ్లి తిరిగి అదే ప్లేస్‌లో నిలబడేందుకు తాడు దాటి లోపలికి వచ్చానని, కానిస్టేబుల్ వెనుక లైన్ నుంచి రావాలని గట్టిగా లాగాడని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. యూరియా పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సాగర్ సీఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో పెద్దవూర, నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది భద్రతాచర్యలు చేపట్టారు. పెద్దవూర ఎస్ఐతోపాటు సాగర్ ఎస్ఐ ముత్తయ్య సిబ్బంది బందోబస్తులో ఉన్నారు.



వృత్తి నిబద్ధతతోనే గుర్తింపు

- కార్మిక ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రజాశక్తి కల్చరల్

వృత్తిలో నిబద్ధత అంకిత భావంతో పని చేసిన వారికి గుర్తింపు గౌరవం లభిస్తుందని రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై శృతి లయ ఫౌండేషన్, సీల్ వెల్ కార్పొరేషన్ నిర్వహణలో విఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతి పురస్కరించుకొని అక్కినేని మీడియా విశిష్ట ప్రతిభా పురస్కారాలు ప్రదానోత్సవం సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వివేక్ వెంకటస్వామి పాల్గొని పురస్కారాలు నవ తెలంగాణ బసవపున్నయ్య, బిగ్ టివి అశోక్ కుమార్, నమస్తే తెలంగాణ కె కృష్ణ ప్రసాద్ 10 టివి డిజిటల్ శివ రామ ప్రసాద్ పాప్ కార్న్ మీడియా హేమసుందర్ రావు, సాక్షి టివి అంజలి రెడ్డి, వి 6 చంద్రిక , టివి 9 నిషిత,10 టివి ధనలక్ష్మి లకు బహుకరించి మాట్లాడారు. ఎంతో ఒత్తిడి తో మీడియా రంగంలో పనిచేస్తూ ప్రజల అభిమానం పొందుతున్న వారిని సత్కరించడం ముదావహం అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు అన్నపూర్ణా స్టూడియో ప్రారంభ సందర్భంగా తమ తండ్రి వెంకట స్వామి సహకారం అందించారని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు ఎస్‌వి సూర్య ప్రకాష్ రావుకు అక్కినేని జీవిత సాఫల్య పురస్కారం అందించారు జర్నలిస్ట్ రఫీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సాధారణంగా జర్నలిస్ట్ శ్రమను గుర్తించరని అన్నారు. స్పందన తెలుపుతూ బసవపున్నయ్య జర్నలిస్టు సమాజంలో రుగ్మతలు వెలికితీయడం వారి బాధ్యత అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నిబద్ధతతో పనిచేస్తున్నవారికి అవార్డ్స్ ప్రదానం చేస్తున్నామని తెలిపారు. వేదిక దైవజ్ఞ శర్మ అనూహ్య రెడ్డి కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు. వేదికపె ప్రముఖ గాయని ఆమని జన్మదిన వేడుకను గాయని గాయకులు జరిపారు.

విద్యారంగ సమస్యలపై పోరాటాలు

- ప్రభుత్వ విద్య పట్ల పాలకుల వివక్ష తగదు
- రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శనిగరపు రజనీకాంత్, టి నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు

రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు విద్యార్థులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో మంగళవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రభుత్వ విద్యారంగం రోజురోజుకూ నిర్వీర్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేకపోవడం బాధాకరమన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఐటీఐ అడ్మిషన్లను పునరుద్ధరించాలని రాష్ట్ర అధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ఐటీఐలో ప్రవేశాలను నిలిపివేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఎటిసిలను తీసుకొచ్చి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామనే పేరుతో సంప్రదాయ ట్రేడ్లలో అడ్మిషన్లను నిర్లక్ష్యం చేయడం సరికాదని చెప్పారు. రూ.8,700 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేస్తామని హామీ ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని చెబుతోందన్నారు.

ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. యువత మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘమని, విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఘనత ఎస్ఎఫ్ఐదేనని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థుల్లోనూ కులాలు,మతాలను చొప్పించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మతోన్మాద రాజకీయాలను అడ్డుకోవాలని, శాస్త్రీయ విద్యా విధానం కోసం రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపెల్లి పూజ, సహాయ కార్యదర్శులు గజ్జెల శ్రీకాంత్, కిరణ్, ప్రశాంత్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, రాష్ట్ర కమిటీ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మన బతుకమ్మ ప్రోమో విడుదల

- సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన టిజిటిడిసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన "మన బతుకమ్మ 2025" పాట ప్రోమో విడుదలైంది. ప్రోమోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. పూర్తి పాటను బుధవారం సాయంత్రం ఎనిమిది గంటలకు విడుదల చేయనున్నారు. ప్రముఖ ప్రజాకవి, గాయకుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అద్భుతమైన సాహిత్యం అందించగా సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు. అదితి భవరాజు, మంగ్లీ, గోరటి వెంకన్న ఆలపించగా ఈశ్వర్ పెంటి (ప్రేమలో ఫేమ్) నృత్య రూపకల్పన చేశారు. దర్శకుడు బద్రప్ప గాజుల ప్రతి సన్నివేశాన్ని సజీవ చిత్రంగా మలచగా, శ్యామ్ దుపాటి, ఉదయ్ గుర్రాల (సినిమాటోగ్రఫీ) తెలంగాణ పల్లె దృశ్యాలు, పండుగ వాతావరణం, ఉత్సాహం అన్నింటినీ అద్దం పట్టినట్లుగా అద్భుతంగా తెరకెక్కించారు. ఓ తంగేడు పూల తల్లి బతుకమ్మ అంటూ సాగే ఈ పాటను తెలంగాణ ఆడపడుచులు ఆడిపాడుకునేలా రూపొందించారు. 49 సెకన్ల నిడివి గల ఈ ప్రోమో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

అమ్మాయిల ఉన్నత చదువులకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ చేయూత

- 15 వేల మందికి రూ.30 వేల స్కాలర్‌షిప్
- నెలాఖరు వరకు దరఖాస్తుకు అవకాశం
- బాలకిష్టారెడ్డి, శ్రీనివాసరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమ్మాయిల ఉన్నత చదువులకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ చేయూతనందించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో పదో తరగతి, ఇంటర్ చదివిన 15 వేల మందికి ఏటా అమ్మాయిలకు రూ.30 వేల స్కాలర్‌షిప్ అందించనున్నట్టు ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ తెలంగాణ హెడ్ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది మూడు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన స్కాలర్‌షిప్‌లను అందజేశామని వివరించారు. ఈ ఏడాది నుంచి 18 రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో 15 వేల మంది అమ్మాయిలకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈనెల పదో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందనీ, ఇప్పటి వరకు 3,276 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఈనెల 30 వరకు దరఖాస్తులను సమర్పించేందుకు అవకాశముందని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. లాటరీ ద్వారా అమ్మాయిలను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోళ్లు

- మొదటిసారిగా ప్యాడీ డ్రైయర్స్, ప్యాడీ క్లీనర్ల వాడకం
- 8,332 కేంద్రాల ఏర్పాటు
- పౌరసరఫరాలశాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లను అక్టోబర్ నుంచి ప్రారంభిస్తున్నట్టు పౌరసరఫరాలశాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాల సంస్థ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల కోసం కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్టు తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా ప్యాడీ డ్రైయర్స్, ప్యాడీ క్లీనర్లను ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. వీటిని ఉపయోగించడం ద్వారా పంట చేతికి వచ్చిన తర్వాత వచ్చే నష్టం, రైతులు ఎక్కువగా వాతావరణ పరిస్థితులపై ఆధారపడటం తగ్గుతాయని వివరించారు. ధాన్యం కొనుగోలు కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,332 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 2025-26 సీజన్‌లో 65.96 లక్షల ఎకరాల్లో 159.15 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశారు. రాష్ట్రం 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరిస్తుందని వివరించారు. అక్టోబర్ లో 6.89 లక్షల మెట్రిక్ టన్నులు, నవంబర్‌లో 32.95 లక్షల మెట్రిక్ టన్నులు, డిసెంబర్ లో 27.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య సహకార సంఘాల ద్వారా 4,252, ఐకెపిల ద్వారా 3,522, ఇతరుల ఆధ్వర్యంలో 558 ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా నుంచి అత్యధికంగా 6.80 లక్షల మెట్రిక్ టన్నులు, జగిత్యాల నుంచి 5 లక్షల మెట్రిక్ టన్నులు, నల్లగొండ నుంచి 4.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపోయినంతగా తార్పాలిన్లు, ఆటోమ్యాటిక్ ప్యాడీ క్లీనర్లు, ఆటోమ్యాటిక్ ప్యాడీ డ్రైయర్స్, గ్రెయిన్ కాలిపర్స్, మాయిశ్చర్ మీటర్లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, హస్క్ రిమూవర్స్ తదితర వాటిని అందుబాటులో ఉంచనున్నారు.ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా 56 ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయనున్నారు. వీటిని మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట్, గద్వాల, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు. రైతులకు ఉపయోగపడేలా వాతావరణశాఖ సూచనలను అందించనున్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా నివారణకు పలు రకాల చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. వ్యవసాయ, సహకార, హోం, గ్రామీణాభివృద్ధి, తూనికలు, కొలతలు తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటున్నట్టు చౌహాన్ తెలిపారు.

అభివృద్ధి నిరోధక బిఆర్ఎస్ గుర్తింపు రద్దు చేయాలి

- పిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



స్థానిక ఎన్నికలను బహిష్కరించాలంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) భూనిర్వాసితులకు పిలుపునివ్వడం సిగ్గుచేటని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ అన్నారు. కెటిఆర్ అభివృద్ధి నిరోధకుడని విమర్శించారు. ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్వార్థ రాజకీయాల కోసం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ తెలంగాణ రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న బిఆర్ఎస్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ మాటలను తెలంగాణ సమాజం ఖండించాల్సిన అవసరముందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందన్న విషయం అనేక పదవులు పొందిన కేటీఆర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణమైతే తెలంగాణ దశ,దిశ మారిపోతోందన్నారు. ప్రస్తుతం మనం అనుభవిస్తున్న సౌకర్యాలు, రోడ్లు, విద్యుత్తు, నీటి ప్రాజెక్టులు, మెట్రో నిర్మాణాలన్నీ ఆనాడు ఎంతో మంది ప్రజలు భూములిస్తేనే కదా? అని ప్రశ్నించారు. ఆ వాస్తవాలను ప్రజలకు వివరించి రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి భూములివ్వాలని కోరాల్సిన కెటిఆర్... స్థానిక ఎన్నికలను బహిష్కరించాలని కోరడమంటే రాజ్యాంగ విరుద్ధమేనన్నారు. హైడ్రా కూల్చివేతల వల్లగానీ, మూసీనది ప్రక్షాళన, పునరుద్ధరణ వల్లగానీ నిర్వాసితులైన పేదలకు పక్కా ఇళ్లు కట్టించేందుకు సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ సర్కారు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజలు ప్రతిపక్షాల ఊబిలో చిక్కుకోవద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఖజానా అంతా రాబందుల్లా దోచుకుని, సకల సంపదలూ కొల్లగొట్టిన బిఆర్ఎస్ నేతలకు నాయకుడైన కేటీఆర్ అధికారం కోల్పోయిన అక్కసుతో అబద్ధాలు వల్లెవేస్తున్నారని విమర్శించారు. పదేండ్లు అభివృద్ధి చేసుంటే, ఇండ్లు లేని లక్షల మంది పేదలు ఇంకా ఎందుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటుకే సార్ధకత లేకుండా చేసిన కెటిఆర్ ఇంకా కలల లోకంలోనే విహరించకుండా, కిందకు దిగి వాస్తవాల్లో జీవించాలని ఆయన సూచించారు.

పేదల నివాసాలపై ప్రతాపమా!

- కూల్చిన చోట ఇందిరమ్మ ఇళ్లు కట్టించివ్వాలి : జాన్‌వెస్లీ
- గాజులరామారంలో ఇండ్లు కోల్పోయిన బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బాధితులతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

పెద్దలను వదిలేసి పేదలపై హైడ్రా ప్రతాపం చూపడం దారుణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజులరామారం ప్రాంతంలో ఇటీవల ఇళ్లు కూల్చివేసిన ప్రాంతాన్ని స్థానిక సిపిఎం శ్రేణులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు నివసిస్తున్న ఇళ్లను కూల్చిన చోటే ఇందిరమ్మ ఇళ్లు కట్టించివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాజులరామారం సర్కిల్‌లోని సర్వే నెంబర్ 307లోని గాలి పోచమ్మ బస్తీ మంజూరునగర్ బస్తీ, బాలయ్యనగర్ తదితర బస్తీలలో 40 సంవత్సరాల నుంచి పేదలు చిన్నచిన్న ఇండ్లు కట్టుకొని నివసిస్తూ క్వారీ గుంతలలో పనిచేస్తున్నారని తెలిపారు. వారి ఇళ్లను హైడ్రా, ప్రభుత్వ యంత్రాంగం ఆదివారం కూల్చేశాయని, ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. పేదలు కష్టపడి చిన్న చిన్న ఇండ్లు కట్టుకుంటే ప్రజా ప్రభుత్వం ఓర్వలేక పోతున్నదన్నారు. బడా పెట్టుబడిదారులను కాపాడుతూ పేదలపై మాత్రమే హైడ్రా పేరు మీద దాడులు చేయిస్తోందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులుగా ఉన్నప్పుడు ఈ బస్తీలకు వచ్చి "మీరంతా పేదలు.. మీకందరికీ సొంత ఇండ్లు కట్టుకునే విధంగా ఏర్పాటు చేస్తాను" అని చెప్పి ఇప్పుడు అదే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పేదల ఇండ్లు కూలగొట్టించడం సరికాదన్నారు. ఈ ప్రాంత ప్రజలందరినీ ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కడుపు కొట్టి పెట్టుబడిదారులకు పెట్టినట్టు.. ఈ ప్రభుత్వం కూడా అలాగే చేస్తున్నదని అన్నారు.

సిపిఎం రాష్ట్ర కంట్రోల్ చైర్మన్ డిజి నర్సింహారావు మాట్లాడుతూ.. చెరువుల భూములను ఆక్రమించిన వారి ఇండ్లను హైడ్రా కూలగొట్టాలి కానీ ఎలాంటి చెరువులూ లేని క్వారీ గుంతలలో కష్టపడి పని చేసి కట్టుకున్న ఇండ్లను కూల్చడం సిగ్గుచేటన్నారు. పేదల ఇళ్లను కూల్చిన చోటనే కట్టించాలని డిమాండ్ చేశారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, నాయకులు బి.వెంకటరామయ్య, ఎం శంకర్ రాథోడ్ సంతోష్, బాల వెంకటేశ్వరరావు, బాలపీర్, శ్రీను, దేవదానం, ఎండి ముక్తార్, వజీర్, ఎండి మోసిన్, శ్రీనివాస్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు రూ.ఐదు వేల గౌరవ వేతనం

- కమీషన్ పెంపును ప్రకటించాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.ఐదు వేలతో పాటు కమీషన్ పెంచుతూ ప్రకటన చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో పలువురు రేషన్ డీలర్లు హరీశ్ రావును కలిశారు. తమ సమస్యలను ఆయనతో ఏకరువు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రేషన్ డీలర్ల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అధికారంలోకి వచ్చి 22 నెలలైనా హామీ అమలుపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. నెలల తరబడి కమిషన్ చెల్లించకుండా కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ డీలర్లకు మెట్రిక్ టన్నుకు కమీషన్‌ను రూ.200 నుంచి రూ.1,400 పెంచిందని హరీశ్ రావు గుర్తుచేశారు. కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100 మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్ మంజూరు చేశామనీ, రేషన్ డీలర్‌షిప్ వయో పరిమితిని 40 నుంచి 50 ఏళ్లకు పెంచినట్టు తెలిపారు. పండుగల సమయంలో రేషన్ డీలర్లను వేధించడం సరికాదని, ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ కమీషన్, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సెప్టెంబర్ కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని హరీశ్ రావు కోరారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న రాష్ట్ర సర్కార్

- సంక్షేమ బోర్డు నిధుల దారి మళ్లింపు వెంటనే ఆపాలి
- ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు లబ్ధి చేసే జిఒ 12ను రద్దు చేయాలి : పాలడుగు భాస్కర్
- కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముందు బిల్డింగ్ వర్కర్ల ధర్నా



కార్మికులతో కలిసి ధర్నా చేస్తున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఫ్లకార్డులు, జెండాలు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ కార్మిక శాఖలో అవినీతిని అరికట్టాలని, సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భాస్కర్ కార్మికుల నుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని మోడీ సర్కార్ అడుగులకు మడుగులొత్తుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికులకు మరణ శాసనంగా మారనున్నాయని హెచ్చరించారు. రాష్ట్రం నుంచి బిజెపి మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లపై విమర్శిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తున్నదని విమర్శించారు. కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలనే జిఒ నెం. 12ను సవరించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని, అక్రమంగా వారికిచ్చిన రూ.346 కోట్లు తిరిగి బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కోటంరాజు మాట్లాడుతూ 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి వారి నిర్ణయం ప్రకారమే నిధులను ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ సెస్ ద్వారా సంక్షేమ బోర్డుకు రూ.5,800 కోట్లు రాగా, అందులో కేవలం రూ.1,570 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని గుర్తు చేశారు. మిగతా నిధులను నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించిందని విమర్శించారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయకుండా కార్మిక శాఖ అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడి ఎలాంటి గుర్తింపు లేని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్కీములను అప్పగించి కార్మికుల నోట్లో మట్టికొట్టారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 2009 నుంచి 2025 వరకు బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులు 27,12,979 మంది ఉండగా, 15 లక్షల మంది సభ్యత్వం మాత్రమే రెన్యువల్ చేసారని అన్నారు. మిగతా 12 లక్షలకు పైగా కార్మికుల కార్డులను వెంటనే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ చెస్ట్ పేరుతో సిఎస్‌సి సంస్థకు రూ.463 కోట్లు దోచి పెట్టారని మండి పడ్డారు. దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులను వెంటనే రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు పెండింగ్ పరిహారాలను వెంటనే విడుదల చేయాలని, 60 ఏళ్ళ పైబడిన కార్మికులకు పెన్షన్, పిల్లల చదువులకు ఉపకార వేతనాలు అందించాలని కోరారు. లేబర్ అడ్డాల్లో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లాంటి కనీస వసతులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం డిప్యూటీ లేబర్ కమిషనర్ జాన్సన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) అధ్యక్షులు సుందర్ రామ్మోహన్ రావు, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు కె.రాజు, సౌత్ జిల్లా అధ్యక్షులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆల్మట్టి ఎత్తు పెంచితే దక్షిణ తెలంగాణకు తీరని నష్టం

- రాష్ట్రాన్ని రక్షించే చర్యలను రేవంత్‌రెడ్డి సర్కారు తీసుకోవాలి : రాంచందర్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519 మీటర్ల నుంచి 524 మీటర్లకు పెంచితే దక్షిణ తెలంగాణ రైతులకు తీరని నష్టం జరుగుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు స్టే ఉన్నప్పటికీ కర్ణాటక సర్కారు భూసేకరణ చేపట్టడం చట్టవిరుద్ధమని చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి హక్కులను రక్షించేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు ఎందుకు చొరవ తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపును ఆపకపోతే ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ, పాలమూరు జిల్లాలు ఎడారిగా మారే ప్రమాదం ఉందనీ, జూరాల, శ్రీశైలం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల, కల్వకుర్తి, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు ఒట్టిపోయే ప్రమాదముంటుందని హెచ్చరించారు. కేసీఆర్ సర్కారు అధికారంలోకి వచ్చాక తెలంగాణకు కృష్ణా జలాల వాటా కేవలం 299 టిఎంసిలు సరిపోతాయని సంతకం చేయడం వల్లనే తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. కర్నాటక సర్కారు తెలంగాణకు ద్రోహం చేయకుండా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలతో మాట్లాడించాలని డిమాండ్ చేశారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే సిఎం రేవంత్ రెడ్డి పాలమూరుకు నీరు ఆగిపోయే ప్రమాదమున్నా ఎందుకు నోరు మూసుకుంటున్నారని ప్రశ్నించారు.

గాంధీభవన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాంధీభవన్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. టిపిసిసి ఎన్‌ఆర్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం గల్ఫ్ కార్మికుల సంక్షేమ బతుకమ్మ సంబరాలు జరిపారు. బతుకమ్మ సంబరాల్లో టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ విజయలక్ష్మి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల గద్దర్, గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎన్‌ఆర్‌ఐ చైర్మన్ వినోద్ కుమార్, సభ్యులు, చెన్నమనేని శ్రీనివాస్, వైశ్యా కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, రైతు కమిషన్ సభ్యులు భవాని రెడ్డి, బొజ్జ సంధ్యా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జిఎస్‌టి పేరిట కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల రక్తం తాగిందని ఆరోపించారు. జిఎస్‌టి తగ్గుదలతో పేదలకు లబ్ధి చేసినట్టు బిజెపి నాయకులు బిల్డప్ ఇస్తున్నారని విమర్శించారు. జిఎస్‌టి అంటే గబ్బర్ సింగ్ టాక్స్ అంటూ మొదటి నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెబుతున్నారని గుర్తు చేశారు. పేదలను దోచుకునేందుకు జిఎస్‌టి తెచ్చారని విమర్శించారు. శవ పేటికలు, పసి పిల్లల తినుబండారాలపై కూడా జిఎస్‌టి వేశారని తెలిపారు. జిఎస్‌టితో పన్నులతో ఏమైనా మంచి పని చేశారా? అని ప్రశ్నించారు. ఆర్థిక సంక్షోభం నుంచి తప్పించుకునేందుకు మోడీ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని చెప్పారు.

కెసిఆర్ వల్లే సమ్మక్క సారక్క బ్యారేజ్

- మాజీ ఎంపి వినోద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ వల్లే సమ్మక్క-సారక్క బ్యారేజ్ వచ్చిందని మాజీ ఎంపి బి.వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 50 ఎకరాల ముంపునకు సంబంధించి ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం కుదిరితే ఏదో గొప్పలు సాధించినట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 2001లో తెలంగాణ ఉద్యమానికి భయపడి నాటి సీఎం చంద్రబాబు నాయుడు దేవాదుల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి రూ.811 కోట్లకు జిఒ ఇచ్చారనీ, 2009 నాటికి ఆ ప్రాజెక్టు పూర్తి చేయలేదని గుర్తుచేశారు. రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు ఖర్చు పెట్టినా నీరు సరిగ్గా తోడలేదనీ, ఇన్‌టెక్ వెల్ సరిగ్గా ఏర్పాటు చేయలేదనీ, 170 రోజులు తోడాల్సి ఉండగా 110 రోజులు కూడా రాలేదనీ, కాంగ్రెస్ హయాంలో 37 టిఎంసిల నీళ్లు కూడా రాలేదని తప్పుపట్టారు. కెసిఆర్ అధికారంలోకి వచ్చాక దేవాదుల ప్రాజెక్టును సరిదిద్దారనీ, దాన్ని పటిష్టం చేసేందుకు ఏడు టిఎంసిలసామర్థ్యంతో సమ్మక్క-సారక్క బ్యారేజ్‌ను నిర్మించారని తెలిపారు. పెండింగ్ రిజర్వాయర్లను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని, తుమ్మిడి హట్టి దగ్గర 152 మీటర్లకు తక్కువగా బ్యారేజ్ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోకూడదని డిమాండ్ చేశారు. మేడిగడ్డకు మరమ్మత్తులు మొదలు పెట్టి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ,మాజీ ఎమ్మెల్యేలు డి.వినయ్ భాస్కర్, డాక్టర్ మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి గురుకుల ఉపాధ్యాయుల బస్సు యాత్ర

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గురువారం నుంచి 317 జిఒ బాధితులైన ఎస్‌సి గురుకుల ఉపాధ్యాయుల బస్సు యాత్ర (317 జిఒ బాధితులు) నిర్వహిస్తున్నట్టు టిగారియా సంఘం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ మధుసూదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ గణేశ్, సోషల్ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ ఎస్ గణేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌సి గురుకుల సొసైటీలో 317 జిఒ అమలు వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు హైదరాబాద్‌లో బస్సు యాత్రను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ జిఒ అమలు వల్ల సొసైటీలో తమకు జరిగిన నష్టాన్ని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోర్టల్‌లో కనీసం అప్లై చేసుకునేటువంటి అవకాశాన్ని కోల్పోయినటువంటి విధానాన్ని ప్రచారం చేయనున్నట్టు పేర్కొన్నారు. బస్సు యాత్రలో 317 బాధిత ఉపాధ్యాయులతో పాటు, టిగారియా సంఘం రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొంటారని తెలిపారు.

మంథనిలోనే ఉంటున్నా

- మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాను మంథనిలోనే ఉంటున్నాని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను కనబడడంలేదంటూ వస్తున్న కథనాలను ఆయన ఖండించారు. మంథనిని దోచుకుంటున్న శ్రీధర్ బాబుపై కథనాలు నడపాలని కోరారు. తాను ఓడినా, గెలిచినా మంథనిలో ఉంటున్నట్టు తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రోద్బలంతో తనపై తప్పుడు కథనాలు ప్రసారం చేయొద్దని కోరారు. 40 ఏళ్లుగా మంథనిని ఏలుతున్న శ్రీధర్ బాబు కుటుంబం నియోజకవర్గానికి చేసిందేమి లేదని విమర్శించారు. శ్రీధర్ బాబు తండ్రి నక్సలైట్ల పేరుతో ప్రజలను చంపిస్తే, శ్రీధర్ బాబు పోలీసులను వాడుకుని తమ కార్యకర్తలను వేధిస్తున్నారని ఆరోపించారు. గతంలో వామన రావు దంపతుల హత్యకేసు విచారణ హైకోర్టు పర్యవేక్షణ లోనే జరిగిందనీ, సిబిఐ విచారణకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

డెక్కన్ సిమెంట్స్‌లో కార్మికుని మృతిపై అనుమానాలు!

- నిజనిర్ధారణ కోసం వచ్చిన సిఐటియు నాయకులకు అనుమతి నిరాకరణ
- పోలీస్ పహారాలోనే కర్మాగారం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా పాలకీడు మండల పరిధిలోని భవానిపురం డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ ఇంకా పోలీసు పహారాలోనే ఉంది. ఆదివారం రాత్రి జరిగిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు నవీన్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి మంగళవారం సిఐటియు జిల్లా నాయకులు ఘటనా స్థలానికి వెళ్లగా.. పోలీసులు పరిశ్రమలోకి అనుమతించలేదు. పరిశ్రమ యాజమాన్యం కార్మిక సంఘంతో చర్చించడానికి సుముఖత చూపినా.. పోలీసులు అనుమతించకపోవడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై సిఐటియు జిల్లా అధ్యక్షులు రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. పరిశ్రమ బయట ఉన్న కొంతమంది ఇతర రాష్ట్రాల వలస కూలీలను కలిస్తే.. వారు నాయకులతో తమ గోడును వెళ్లబోసుకున్నారు. కాంట్రాక్టర్ కనీస వేతనాలు ఇవ్వడంలేదని, భద్రత, నివాసం, ప్రమాద బీమా లాంటివి ఏవీ ఇవ్వడని, తమ ప్రాణాలకు విలువ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పరిశ్రమలో జరిగిన కార్మికుని మృతి దురదృష్టకరమన్నారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ముందు చూపు లేకపోవడంతోనే ఘర్షణ వాతావరణం నెలకొందని తెలిపారు. నివాస ప్రదేశంలో కాలుజారి పడటంతో కార్మికునికి ప్రమాదం జరిగిందని, మరోవైపు పని ప్రదేశంలోనే ప్రమాదం జరిగి మృతిచెందాడని.. ఇలా రెండు వాదనలు బలంగా వినపడుతున్నాయని తెలిపారు. ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులకు లేదా అని ప్రశ్నించారు. వాస్తవాలను తెలుసుకోవడానికి వచ్చిన తమను పరిశ్రమ ప్రాంగణంలోకి, కనీసం కాంట్రాక్ట్ కార్మికులు నివాసముండే ప్రదేశాన్ని కూడా చూడనివ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. యాజమాన్యం, కార్మికులతో జరిగిన వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి వచ్చామని స్పష్టం చేశారు. సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కాంట్రాక్టర్లతో చేతులు కలిపి వలస కూలీల శ్రమను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

ఘటన జరిగి 48 గంటలు గడుస్తున్నా.. ఘర్షణ నేపథ్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్న కార్మికులు ఎంత మంది? వారిని ఎక్కడ ఉంచారన్న సమాచారం ఇవ్వకపోవడం ఏంటని నాయకులు ప్రశ్నించారు. వలస కార్మికులను చిత్రహింసలకు గురి చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయని, దీనిపై జిల్లా ఎస్పీ స్పందించాలని కోరారు. సిమెంట్ పరిశ్రమల్లో 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి భద్రత కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై లేదా అని ప్రశ్నించారు. తక్కువ వేతనాలకు కూలీలు వస్తున్నారనేదే చూడకుండా, కాంట్రాక్టర్లతో కార్మిక చట్టాలు అమలు చేయించాలని డిమాండ్ చేశారు. త్వరలో ఈ ఘటనపై వాస్తవాలను పోలీసులు ఆధారాలతో బయట పెట్టకపోతే అన్ని కార్మిక సంఘాలతో కలిసి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిమెంట్ క్లస్టర్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ ఒట్టేపు సైదులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను, నాయకులు అనంత ప్రకాష్, యాకూబ్, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు నన్నెపంగ రమేశ్, మాజీ జెడ్పీటీసీ ముషం నర్సింహ, మాజీ ఎంపీటీసీ దొంగరి వెంకటయ్య, స్థానిక నాయకులు పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

తాల్ హెల్త్‌ఫెస్ట్ 2025కు రండి

- కెటిఆర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికాలో జరిగే ప్రతిష్టాత్మక తాల్ హెల్త్‌ఫెస్ట్ 2025కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు తాల్ హాస్పిటల్స్ సిఇఒ సాయి గుండవెల్లి కెటిఆర్‌ను కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్శిటీ మాజీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్ సాయి గుండవెల్లి వెంట ఉన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 24న కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగోలో ఈ 'హెల్త్‌ఫెస్ట్ 2025' నిర్వహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య నిపుణులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, మార్పు తీసుకొచ్చేవారిని ఒకే వేదికపైకి తీసుకు రానున్నారు. భవిష్యత్ ఆరోగ్య సంరక్షణపై చర్చించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యక్తిగత వైద్యం, డిజిటల్ హెల్త్‌కేర్ ఆవిష్కరణలు, సమీకృత వైద్య సంరక్షణ, ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఆరోగ్య సేవలకు మార్గాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో కెటిఆర్ కీలకోపన్యాసం ఇవ్వనున్నారు. తెలంగాణలో టెక్నాలజీ ఆధారిత పాలన, ఆవిష్కరణలతో కూడిన అభివృద్ధి, ఆరోగ్య రంగంలో తీసుకువచ్చిన విధానాలు ప్రపంచ ప్రజలకు ఎంతో విలువైనవిగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఆహ్వానాన్ని కేటీఆర్ అంగీకరించినందుకు టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ ధన్యవాదాలు తెలిపింది. హెల్త్‌ఫెస్ట్ 2025లో ఆయన భాగస్వామ్యం ఈ వేదికపై అర్థవంతమైన చర్చలకు దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

జీతాలు రావడంలేదని మిషన్ భగీరథ కార్మికుడు ఆత్మహత్య

- ప్లాంట్ వద్ద మృతదేహంతో కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు మిషన్ భగీరథ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ కార్మికుడు మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కార్మికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వడంలేదని, వెంటనే జీతాలు ఇచ్చి తమను ఆదుకోవాలని కోరుతూ.. రెండు రోజుల నుంచి మండలంలోని పాలేరు గ్రామం వద్ద మిషన్ భగీరథ ప్లాంట్ కార్మికులు సంబంధిత కంపెనీకి సమ్మె నోటీసు ఇచ్చి, సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా సభలో పాల్గొన్న చందనబోయిన గాంధీ (35) ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి, ఇంటికెళ్లి ఉరేసుకొని మృతి చెందినట్టు తోటి కార్మికులు కన్నీరు మున్నీరవుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాంధీ మృతికి ఎల్‌అండ్‌టి కంపెనీనే బాధ్యత వహించాలని.. మృతదేహంతో మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద కార్మికులు ఆందోళనకు దిగారు.

నిలోఫర్‌లో హాస్టల్ బిల్డింగ్ నిర్మాణం

- స్థలాన్ని పరిశీలించిన హెల్త్ సెక్రెటరీ క్రిస్టీనా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిలోఫర్ హాస్పిటల్ ప్రాంగణంలో 280 మంది డాక్టర్లు(పీజీ స్టూడెంట్స్, సీనియర్ రెసిడెంట్స్) ఉండేందుకు అనువుగా హాస్టల్ బిల్డింగ్స్ నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూ పరిశీలించారు. హాస్టల్ బిల్డింగ్ నిర్మాణానికి స్థల పరిశీలనకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఆస్పత్రిని సందర్శించిన ఆమె హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, డిఎంఇ నరేంద్ర కుమార్, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, టిజిఎంఎస్‌ఐడిసి ఎండి ఫణీంద్ర రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 180 మంది ఫీమేల్ డాక్టర్లు, 100 మంది మేల్ డాక్టర్లకు సరిపడా భవనాలు నిర్మించేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించనున్నట్టు క్రిస్టినా తెలిపారు. హాస్పిటల్ ప్రాంగణంలోనే హాస్టల్ ఉండడం డాక్టర్లతో పాటు, పేషెంట్లకు కూడా మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. వందలాది మంది డాక్టర్లు 24 గంటలపాటు హాస్పిటల్‌లోనే అందుబాటులో ఉంటారనీ, తద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆమె తెలిపారు.

హాస్పిటల్ బిల్డింగ్ పైన నిర్మించిన ఐరన్ స్ట్రక్చర్‌ను త్వరలోనే వైద్య సేవల కోసం అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని, అవసరమైన రిపేర్లు చేయించాలని టిజిఎంఎస్‌ఐడిసి ఎండి ఫణీంద్ర రెడ్డికి క్రిస్టినా సూచించారు. హాస్పిటల్ ప్రాంగణంలో నిర్మించిన ధర్మశాల భవనాన్ని(జీ ప్లస్ 3) నిలోఫర్‌కు అప్పగించాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌ను క్రిస్టినా ఆదేశించారు. 72 రూంలు ఈ భవనంలో అందుబాటులో ఉన్నాయనీ, రోగుల సహాయకుల కోసం ఈ భవనాన్ని ఉపయోగిస్తామని ఆమె తెలిపారు. నిలోఫర్ హాస్పిటల్ బ్రాండింగ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను ఆమె ఆదేశించారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించరా? : క్రిస్టీనా ఆగ్రహం

హాస్పిటల్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ, రద్దీని తగ్గించే అంశంపై క్రిస్టీనా సమావేశంలో చర్చించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులతో గతంలో జరిపిన కొనుగోళ్లపై ఆమె చర్చించారు. ఈ కొనుగోళ్లలో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడంపై సెక్రటరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై కొనుగోళ్లు అన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరపాలని ఆదేశించారు. అవసరమైన పరికరాల కోసం హాస్పిటల్ సూపరింటెండెంట్ ను ప్రతిపాదనలు రూపొందించాలనీ, ఆ ప్రతిపాదనలను డీఎంఈ పరిశీలించి, టిజిఎంఎస్‌ఐడిసికి పంపించాలని సెక్రటరీ ఆదేశించారు. నిబంధనల ప్రకారం గ్లోబల్ టెండర్ల ద్వారా టిజిఎంఎస్‌ఐడిసి కొనుగోళ్లు చేపట్టాలని ఆ సంస్థ ఎండీ ఫణీంద్ర రెడ్డికి సెక్రటరీ సూచించారు.

లాక్టోజ్ రహిత 'జుమి' మిల్క్‌షేక్స్

హైదరాబాద్



లాక్టోజ్ రహితమైన, రిఫైండ్ చక్కెర లేని జుమి మిల్క్ షేక్స్‌ను ఆవిష్కరించినట్లు హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ బీనెరి ఫుడ్స్ వెల్లడించింది. లాక్టోజ్ ను తట్టుకోలేని, జీర్ణక్రియ బలహీనంగా ఉన్నవారి కోసం వీటిని రూపొందించా మని ఆ కంపెనీ ఫౌండర్ తపస్య విజయ రాఘవన్ తెలిపారు. తొలుత ఇది బెంగళూరు, హైదరాబాద్, చెన్నయ్‌లలో జుమిఫుడ్స్.కామ్, క్విక్ కామర్స్ ప్లాట్ ఫాంలలో లభించనుందని వెల్లడించారు.

మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలి

- సిఎంఒ ముఖ్యకార్యదర్శి అజిత్‌రెడ్డికి టిఎంఎస్‌టిఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న మూడు వేల మంది ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు వచ్చేలా 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టిఎంఎస్‌టిఎ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్యకార్యదర్శి అజిత్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు, ప్రధాన కార్యదర్శి కె నగేశ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మోడల్ స్కూల్ టీచర్లకు పెండింగ్‌లో ఉన్న 94 నెలల డిఎ బకాయిలను ఇవ్వాలని కోరారు. 2013 నుంచి 2018 వరకు రావాల్సిన సిపిఎస్ మ్యాచింగ్ గ్రాంట్‌ను మంజూరు చేయాలని తెలిపారు. ప్రతినెలా పదో తారీకు తర్వాతే వేతనాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

బాలికపై లైంగిక దాడి

- పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనర్ బాలికపై, మైనర్ బాలుడు లైంగిక దాడి చేశాడు. బాలిక గర్భం దాల్చడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలుడు, మరో గ్రామానికి చెందిన మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దాంతో బాలిక గర్భం దాల్చింది. కాగా, పోక్సో చట్టం పోలీసులు కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్టు తెలుస్తోంది. లైంగికదాడికి గురైన బాలిక గ్రామాన్ని ఎస్‌పి చైతన్యరెడ్డి సందర్శించినట్టు సమాచారం. బాలికను సఖి సెంటర్‌కు తరలించినట్టు తెలుస్తోంది.

26న కలెక్టరేట్ల వద్ద పంచాయతీ కార్మికుల ధర్నా

- పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి : పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేయనున్నట్టు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రకటించారు. పంచాయతీ కార్మికులందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు అతి ముఖ్యమైన దసరా పండుగకు పంచాయతీకార్మికులు పస్తులుండాలా? అని ప్రశ్నించారు. మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోతే ఎలా బతుకుతారని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ సిబ్బంది వేతనాలకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల బ్యాంక్ అకౌంట్లలో వేతనాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్ పని విధానం వలన ప్రమాదాలు జరిగి మరణిస్తున్న కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షల నష్టపరిహారం ప్రకటించాలనీ, జీఓ నెం.51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్టా యాదమ్మ, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

మహిళా హత్య కేసులో ముగ్గురు అరెస్ట్

- లైంగికదాడికి పాల్పడి.. ఆపై హత్య చేసినట్టు నిందితుల అంగీకారం
- వివరాలు వెల్లడించిన డిసిపి శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళపై లైంగికదాడికి పాల్పడి దారుణంగా హత్య చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 14న పిల్లర్ నెంబర్ 143 హైదర్‌గూడ వద్ద ఉన్న కల్లు కాంఫౌండ్‌లో ఓ మహిళ కల్లు తాగి రోడ్డుపై కొచ్చి స్పృహ కోల్పోయి పడిపోయారు. ఇది గమనించిన లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన మేక దుర్గారెడ్డి ఆమెను బలవంతంగా ఆటోలో ఎక్కించుకొని శంషాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్ ఫంక్షన్ హాల్ వెనకాల ఉన్న నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం అదే ఆటోలో ఆరాంఘర్‌లోని పిల్లర్ నెంబర్ 306 వద్ద ఆమెను వదిలేసి వెళ్లిపోయాడు.

రోడ్డుపై ఉన్న ఆమెను టోలిచౌకి ప్రాంతానికి చెందిన గులాం దస్తగిరి ఖాన్మ, హమ్మద్ ఇమ్రాన్ ఆటోలో ఎక్కించుకొని కిస్మత్‌పూర్‌లోని మోసి బ్రిడ్జి కిందికి తీసుకెళ్లారు. అక్కడ వారు మొదట మద్యం తాగి అనంతరం ఆమెపై లైంగికదాడికి పాల్పడి హత్యచేసి పరారయ్యారు. స్థానికులు మహిళ మృతదేహం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే మిస్సింగ్ కేస్ ఆధారంగా ఆ మహిళను యాకత్‌పురకు చెందిన రేష్మా బేగంగా (35) గుర్తించారు. నగరంలోని లంగర్‌హౌస్ నుంచి ఆరాంఘర్ వరకు ఉన్న సిసి కెమెరాలు పరిశీలించగా.. ఆటోలో ఆ మహిళ వెళ్లిన దృశ్యాలు కనిపించాయి. ఆటో నెంబర్ల ఆధారంగా ముగ్గులు నిందితులైన గులాం దస్తగిరి ఖాన్, మహమ్మద్ ఇమ్రాన్, మేక దుర్గా రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరాన్ని అంగీకరించారు. ఈ ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో మేక దుర్గారెడ్డిపై గతంలో అనేక కేసులు ఉన్నాయి. వారి వద్ద నుంచి రెండు ఆటోలు, నాలుగు ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

డిసిఎం ఢీకొని ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి

- హయత్‌నగర్‌లో రోడ్డు దాటుతుండగా ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలేజీ బస్సు కోసం రోడ్డు దాటుతున్న ఇంజనీరింగ్ విద్యార్థినిని అతివేగంతో డిసిఎం ఢీకొనడంతో ఆమె మృతిచెందింది. ఈ విషాద ఘటన హైదరాబాద్ హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం.. హయత్‌నగర్ లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటున్న అహ్మద్ యమ్న (20) ఇంజనీరింగ్ చదువుతున్నారు. రోజు మాదిరిగానే కాలేజీ బస్సు ఎక్కేందుకు మంగళవారం కృష్ణవేణి ఆస్పత్రి వైపు వెళ్లేందుకు ఆమె రోడ్డు దాటుతోంది. ఆ సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి డిసిఎం అతివేగంతో వచ్చి ఆమెను ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.